క్లుప్తంగా

31న కౌన్సిల్ సమావేశం

నరసాపురం: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 31వతేదీ బుధవారం ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ చెప్పారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అజెండాలోని అంశాలతో పాటుగా వార్డుల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తామని చెప్పారు. సభ్యులు విధిగా హాజరుకావాలని కోరారు.

మెరుగు పెడతామంటూ మోసం చేశారు

నరసాపురం రూరల్: బంగారు ఆభరణాలకు మెరుగు పెడతామంటూ మాయమాటలు చెప్పి 8 కాసుల బంగారాన్ని దొంగిలించిన సంఘటన నరసాపురం మండలంలోని లక్ష్మణేశ్వరం చాగంటి వారిమెరక గ్రామంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి రూరల్ ఎస్సై సుధాకరరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో మండలంలోని లక్ష్మణేశ్వరం చాగంటి వారిమెరక గ్రామానికి చెందిన తోట వెంకటలక్ష్మి అనే 60 ఏళ్ల వృద్ధురాలి ఇంటికి ఇరువురు వ్యక్తులు వచ్చి బంగారు వస్తువులకు మెరుగు పెడతామని చెప్పి నమ్మబలికారు. వారి మాటలను నమ్మిన వృద్ధురాలు నాలుగు బంగారు గాజులను వారికి ఇవ్వగా ఆ గాజులకు ఏదో తైలం రాసి కుక్కర్‌లో ఉంచి కాసేపటి తర్వాత స్టవ్‌ను ఆఫ్ చేసి చల్లారిన తర్వాత తీయాలని సూచిస్తూ వృద్ధురాలిని మాటల్లో మభ్యపెట్టి ఆమె ఇచ్చిన గాజులను కుక్కర్‌లో పెట్టకుండానే పెట్టినట్లుగా నాటకమాడి బయటకు ఉడాయించారు. అనంతరం వృద్ధురాలు కుక్కర్ మూత తీసి చూసి అవాక్కయ్యి నగలతో వారు ఉడాయించారని గ్రహించి రూరల్ పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అనధికార లేఅవుట్‌లకు అనుమతి తీసుకోవాలి

మొగల్తూరు: అనధికార లేఅవుట్‌లలో అనుమతులు తీసుకోకపోతే వాటిలో వేసిన రోడ్లను ధ్వంసం చేస్తామంటూ ఈఓపీఆర్డీ నవీన్ కిరణ్ హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో సుమారు 38 లే అవుట్‌లు ఉండగా వేటికి అనుమతులు లేవన్నారు. కొత్తపాలెంలో వేసిన లేఅవుట్‌కు సంబంధించి పంచాయతీకి స్థలం కేటాయించడంతో ఆ స్థలంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం నిర్మించామని పేర్కొన్నారు. లేఅవుట్‌లు వేసిన వారు ఈ నెల 31 లోపు పంచాయతీ అనుమతులు తీసుకుని గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు.

వృద్ధుడిపై దాడి...వ్యక్తిపై కేసు

మొగల్తూరు: తనను కొట్టి గాయపర్చాడంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.వీరబాబు శనివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం పేరుపాలెం పంచాయతీ తెన్నేటిపేటకు చెందిన వృద్ధుడు తెన్నేటి సంధ్యారావును అదే ప్రాంతానికి చెందిన తెన్నేటి మోహనరావు ఈ నెల 25న కొట్టి గాయపర్చాడు. బాధితుడు నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మోహనరావుపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మోటార్ సైకిల్ ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్రగాయాలు

మొగల్తూరు: మోటార్ సైకిల్ ఢీకొనడంతో గాయాలు పాలైన వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వాహనం నడుపుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.వీరబాబు శనివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం కాళీపట్నం తూర్పు హెచ్ఆర్ పేటకు చెందిన బాలం సత్యం ఈ నెల 20న గ్రామంలో నడుచుకుంటూ వెళ్తుండగా ఫ్యాషన్ ప్రో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తి బలంగా ఢీకొన్నాడు. దీంతో తీవ్ర గాయాలు పాలైన సత్యం నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేడు వలంటీర్లకు వందనం

పాలకొల్లు అర్బన్: మండలంలో ప నిచేస్తున్న వలంటీర్లకు అవార్డులు అందజేసే నిమిత్తం ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ సంగాని వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో వలంటీర్లకు వజ్ర, రత్న, సేవా మిత్ర అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. సేవా వజ్ర అవార్డు కింద రూ.30 వేలు, సేవా రత్న అవార్డు కింద రూ.20 వేలు, సేవా మిత్ర అవార్డు కింద రూ.10 వేలుతోపాటు ప్రశంసా పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

జర్నలిస్టు కాలనీ స్థలాల పరిశీలన

పెనుమంట్ర: మండలంలోని బ్రాహ్మణ చెర్వులో జగనన్న లేఅవుట్‌లలో జర్నలిస్టులకు ఇచ్చే ఇళ్ల స్థలాలను ఎంపీపీ కర్రి వెంకటనారాయణరెడ్డి, తహసీల్దార్ డీవీఎస్ అశోక్‌వర్మ శనివారం పరిశీలించారు. స్థానిక శాసనసభ్యులు చెరకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశాల మేరకు ఈ లే అవుట్‌ను పరిశీలించారు. ఈ లేఅవుట్‌లో సుమారు 26 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వవచ్చునని అర్హత ఉన్న జర్నలిస్టులకు ఈ లేఅవుట్‌లలో పట్టాలు ఇచ్చి మిగిలిన పట్టాలు నవరత్నాల పథకంలో దరఖాస్తు చేసుకున్న అర్హత ఉన్న లబ్ధిదారులకు కేటాయిస్తామని తెలిపారు. వీరి వెంట స్థానిక ఎంపీటీసీ సభ్యుడు గండి రామారావు తదితరులు ఉన్నారు.

తారెత్తిస్తున్న ఎండలు

- రోహిణి కార్తె ప్రభావంతో మండుతున్న ఎండలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న నిపుణులు



యలమంచిలి మండలం చించినాడ వద్ద నిర్మానుష్యంగా ఉన్న 216 జాతీయ రహదారి

పాలకొల్లు సెంట్రల్/యలమంచిలి: వేసవి కాలంలో ఎండలు తారెత్తిస్తున్నాయి. అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడుతున్నారు. రెండు రోజులు నుంచి రోహిణీ కార్తె ప్రారంభం కావడంతో భానుడు మరింత ఉగ్రరూపం దాలుస్తున్నాడు. దాదాపు 40 నుంచి 50 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల చిన్నా, పెద్దా, వృద్ధులు అనే తేడా లేకుండా వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉంటుంది. ప్రతీ ఒక్కరూ వడదెబ్బ తగలకుండా నివారణ చర్యలు చేపట్టాలి.

వడదెబ్బ అంటే.. ఎక్కువ ఉష్ణోగ్రతల వల్ల మనిషి ఆ వేడికి గురైన సందర్భంలో శరీరంలో వేడిని నియంత్రించే విధానం తగ్గడంతో ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడటాన్ని వడదెబ్బ అంటారు. చాలా వేడి వాతావరణం లేదా చురుకైన పనులు వల్ల కలిగే అధిక వేడిని శరీరం తట్టుకోలేనప్పుడు ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడుతుంది. తద్వారా శరీర ప్రాథమిక అవయవాలు విఫలమయ్యేలా చేస్తాయి. దానితో ఆ వ్యక్తి నీరసించి పడిపోవడం వల్ల వడదెబ్బ తగిలిందని గుర్తించవచ్చు. దీని లక్షణాలు గుండె, నాడి కొట్టుకోవడం, వేగంగా, తక్కువగా శ్వాస తీసుకోవడం, చెమట పట్టకపోవడం, హెచ్చు తగ్గుల రక్తపోటు, చిరాకు, కంగారు, అపస్మారక స్థితి, తలతిరగడం, తెలిపోవడం, తలపోటు, వికారం వంటి వాటిని వడదెబ్బగా గుర్తించాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే..

వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడపట్టున కూర్చోబెట్టాలి. ఆ వ్యక్తి శరీరం చల్లబరిచే విధంగా చర్యలు చేపట్టాలి. అవసరమైతే చల్లని నీటితో శరీరాన్ని తడపాలి. తాగగలిగితే చల్లని పానీయాలు ఇవ్వాలి. దుస్తులు వదులుగా చేయాలి. ఎటువంటి మందులు ఇవ్వకుండా వైద్యులను సంప్రదించాలి.

వడదెబ్బ బారిన పడకుండా ఉండాలంటే

వేసవి ఉష్ణోగ్రతల వల్ల మనిషికి డీ హైడ్రేషన్ అధికంగా ఉంటుంది. తాగునీరు నిత్యం దగ్గర్లో ఉండాలి లేదా అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. నీళ్ల తాగడం వల్ల శరీరం చల్లగా ఉంటుంది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో నీడ పట్టున ఉండేలా చూసుకోవాలి. అనారోగ్య సమస్యలు ఉన్న వారు డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. శరీరంలో ఉష్ణోగ్రతను పెంచే ఆల్కహాల్, సిగరెట్ వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలి. తప్పని పరిస్థితుల్లో ఎండలో వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా కూలింగ్ కళ్లద్దాలు, టోపీ పెట్టుకోవాలి. సాధారణంగా వేసవిలో బయటకు వెళ్లే పరిస్థితి ఉంటే సాధ్యమైనంత వరకూ ఉదయాన్నే లేదా సాయంత్రం సమయంలో ఎండ తక్కువగా ఉన్న సమయాల్లో ప్రయాణం ఏర్పాటు చేసుకోవాలి. ఆహార అలవాట్లలో మషాలా, కారం వంటివి లేకుండా తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలి. బయటకు వెళ్లేటప్పుడు కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు, సోడియం వంటి ఎలక్ట్రోలైట్ వంటి ద్రావణాలు వంటివి సేవించడం చాలా మంచిది.

జాగ్రత్తలు అవసరం



వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు, వేడి గాలుల వల్ల డీ హైడ్రేషన్ సాధారణంగా వచ్చే వ్యాధులు. సరైన సమయంలో చికిత్స తీసుకోకుంటే ప్రాణాంతకం అవుతుంది. తేలిగ్గా జీర్ణం అయ్యే ఆహారాన్ని తీసుకోవాలి. మాంసాహారం తగ్గించి శాఖాహారం తీసుకోవాలి. రోజుకు 15 గ్లాసులు నీటిని తాగాలి. రోడ్లపై విక్రయించే రంగుల పానీయాలు తాగకూడదు. పండ్ల రసాలు, కొబ్బరి నీళ్ల వంటివి సేవించాలి. తేలిక దుస్తులు వాడాలి. వడదెబ్బ తగిలిన వ్యక్తికి గాలితగిలేలా చూడాలి.

– డాక్టర్ జాన్‌లియో,
అర్బన్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్, పాలకొల్లు

సచివాలయాన్ని సందర్శించిన మత్స్యశాఖ కమిషనర్

నరసాపురం రూరల్: మత్స్యశాఖ రాష్ట్ర కమిషనర్, జిల్లా ప్రత్యేక అధికారి కె కన్నబాబు శనివారం నరసాపురం మండలం సరిపల్లి రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయంలో అందుతున్న వివిధ రకాల సేవలను గురించి ఆరాతీశారు. సేవలు సక్రమంగా నిర్వర్తిస్తున్నారా? లేదా? అనే దానిపై ఆరా తీశారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఫాజిల్, డీఎల్‌డీవో కేసీహెచ్ అప్పారావు, ఎంపీడీవో శివప్రసాద్‌యాదవ్, వ్యవసాయశాఖ ఏడీఏ అనిల్ కుమారి ఉన్నారు.

ముత్యాలమ్మ సేవలో..

మొగల్తూరు: ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ అమ్మవారిని రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్, టూరిజం శాఖ ఎండీ, జిల్లా ప్రత్యేకాధికారి కన్నబాబు శనివారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి కండువాను కప్పి, ప్రసాదాన్ని, ఆశీర్వచనాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆలయం ప్రాంగణంలో ఉన్న అమ్మవారి ఫుటాలకు ఆయన ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొల్లాటి రాంబాబు, పాలా రాంబాబు, దొంగ స్వామి తదితరులున్నారు.

పేదలకు ఇళ్లు ఇవ్వడం చంద్రబాబుకు నచ్చడం లేదు



పోడూరులో వలంటీర్లను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పోడూరు: ప్రభుత్వం రాష్ట్రంలో పేద ప్రజలకు ఇళ్లు కట్టివ్వడం చంద్రబాబుకు ఇష్టం లేదని అందుకే పేదలకు పెద్ద ఎత్తున ఇళ్లు ఇవ్వడం చూసి ఓర్వలేక ప్రభుత్వం పై చంద్రబాబు అక్కసు వెళ్లగక్కుతున్నాడని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు విమర్శించారు. పోడూరు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు జెడ్పీ ఫ్లోర్ లీడర్ గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, గ్రామ సర్పంచ్‌లు వలంటీర్లను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్లు కట్టిస్తుంటే సెంటు భూమి శవాలు పూడ్చడానికి కూడా సరిపోదని అక్కసు వెళ్లగక్కడం చాలా దుర్మార్గమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థతో రాష్ట్ర ప్రజలందరికీ పారదర్శకమైన పరిపాలన అందుతుందన్నారు. గతంలో పింఛన్లు అందుకోవడానికి అవ్వతాతలు, వికలాంగులు పడుతున్న కష్టాలు చూసి పింఛన్ల పంపిణీ తో పాటు ఇతర ప్రభుత్వ పథకాలన్నీ ప్రజల ముంగిటకే చేరవేసేలా సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థకు రూపకల్పన చేసి సేవలందిస్తున్నారన్నారు. ప్రభుత్వం తమపై పెట్టిన బాధ్యతను నెరవేరుస్తూ వలంటీర్లంతా ఎంతో అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నారనీ, దేశంలో ఇతర రాష్ట్రాలు వలంటీర్ వ్యవస్థను ఆదర్శంగా తీసుకుంటున్నారని శ్రీరంగనాథరాజు కితాబిచ్చారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక వలంటీర్ వ్యవస్థను రద్దు చేస్తామని చంద్రబాబు గతంలో చెప్పారనీ, కొంతకాలంగా వలంటీర్ వ్యవస్థను తాము కూడా కొనసాగిస్తామని చంద్రబాబు మాయమాటలు చెబుతున్నాడన్నారు. కార్యక్రమంలో జెడ్పీ ఫ్లోర్ లీడర్ గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, పోడూరు సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు, ఎంపీడీఓ ఎం.బలరామరాజు, ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ల డైరెక్టర్లు పోతుమూడి రామచంద్రరావు, పెదపాటి పెద్దిరాజు, వైస్ ఎంపీపీ ఇందుకూరి సీతారామరాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిల్లి నాగన్న, జేసీఎస్ కన్వీనర్ పైడి ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులే నా బలం

నరసాపురం: తన బలమంతా వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులేనని, వారిస్తున్న మద్దతుతో నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పని చేస్తున్నానని ప్రభుత్వ ఛీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శనివారం ముదునూరి తన కార్యాలయంలో నరసాపురం మండల, పట్టణ పార్టీ కమిటీల సమావేశాలను విడివిడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులు నిరంతరం తన వెనకుండి స్ఫూర్తినిస్తున్నారని అన్నారు. అందువల్లే నియోజకవర్గంలో ఆక్వా యూనివర్సిటీ, ఫిషింగ్‌హార్బర్, వశిష్ట వంతెన లాంటి భారీ ప్రాజెక్ట్‌లు తెచ్చుకోగలగామని చెప్పారు. బస్టాండ్ ఆధునీకరణ, 100 పడకల ఆసుపత్రి నిర్మాణాలు పూర్తయ్యాని చెప్పారు. ప్రతిపక్షాలు కోర్టులకు వెళ్లకుండా ఉంటే వశిష్ట వంతెన నిర్మాణం ఓ కొలిక్కి వచ్చేదని వివరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల నిర్మాణం కూడా వేగంగా చేస్తున్నామన్నారు. తమ హయాంలో జరుగుతున్న పార్కుల అభివృద్ధి, రహదారుల నిర్మాణం, కమ్యూనిటీహాల్స్ నిర్మాణం తదితర అభివృద్ధి పనులను ప్రజల్లోకి పార్టీ సభ్యులు తీసుకెళ్లాలని చెప్పారు.



వైఎస్సార్ సీపీ మండల కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

జగన్‌ను ఓడించాలని అందరూ ఏకమవుతున్నారు

రాష్ట్రానికి ప్రజలకు మంచి జరగకూడదు, ఏమైనా సరే వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించాలని ప్రతిపక్షాలు అన్నీ ఏకమవుతున్నాయని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి పేర్కొన్నారు. ప్రతిక్షాల పన్నాగాలను తిప్పకొట్టడానికి, ప్రజలను చైతన్యవంతులను చేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుకు నడవాలని చెప్పారు. కుల, మత, వర్గ, పార్టీ విబేధాలు లేకుండా రాష్ట్రంలో అందరికీ మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. సమావేశాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, వైస్ చైర్ పర్సన్ కామన నాగిని, జడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు బూసరపు జయ , దొంగ మురళీకృష్ణ, మాజీ జడ్పీటీసీ చాగంటి సత్యనారాయణ, వైకేఎస్, కామన బుజ్జి, కడలి రాంబాబు, జేవీఆర్, షేక్ బులిమస్తాన్ పాల్గొన్నారు.

ప్రజలకు, ప్రభుత్వానికి వలంటీర్లే వారధులు

యలమంచిలి: జగనన్న కళ్లు, చెవులుగా పని చేస్తున్న వలంటీర్లే ప్రజలకు ప్రభుత్వానికి వారధులని ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన మండలంలోని 32 గ్రామాల నుంచి సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులు సాధించిన వలంటీర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న మానసిక పుత్రికైన వలంటీర్ వ్యవస్థ వచ్చి 43 నెలలైందన్నారు. ఈ కాలంలో ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకంలోని పథకాలనే కాకుండా సుమారు 25 ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక నుంచి, అమలు వరకు వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. వలంటీర్స్ తమ విధులను ఉద్యోగంలా భావించకుండా సేవగా భావించడం వలనే వారికి ప్రజల్లో ఆదరణ పెరిగిందన్నారు. ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీలు జగనన్నపై బురద జల్లే ప్రయత్నాలు ప్రారంభిస్తాయన్నారు. కానీ జగనన్న అందించిన అవినీతి రహిత పాలన గురించి ప్రజలకు వివరించాల్సిన గురుతర బాధ్యత వలంటీర్లపై ఉందన్నారు. మళ్లీ జగనన్న



వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

ప్రభుత్వం ఏర్పడితే వలంటీర్ల భవిష్యత్తు మరింత బాగుంటుందని శ్రీనివాస్ చెప్పారు. అనంతరం 32 గ్రామాల నుంచి గ్రామానికి ఇద్దరు సేవా మిత్రలకు, సేవా రత్న వచ్చిన ఐదుగురు, సేవా వజ్ర వచ్చిన ఇద్దరు వలంటీర్లను శాలువా, పతకాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ రావూరి వెంకటరమణ సర్పంచ్‌ల చాంబర్ మండల అధ్యక్షుడు వల్లభు సాయి వెంకట నరసింహారావు వైస్ ఎంపీపీ కొప్పాడి శ్రీనుబాబు కాపు కార్పోరేషన్ డైరెక్టర్ ఇలపకుర్తి లక్ష్మీ నరసింహారావు సర్పంచ్‌లు చిలుకూరి సుబ్బారావు, పాలంకి శ్రీనివాసరావు, కవురు గోపి, కామిశెట్టి సాయిబాబా, మద్దా శ్రీనివాసరావు, గటిగంటి మహేష్, పొన్నమండ నాగరాజు, మేడిది విజయ జ్ఞానమణి, దంగేటి రాజమణి, అనిశెట్టి మల్లిక ఎంపీటీసీ సభ్యులు డేగల సూర్యప్రభ, కంబాల సత్యశ్రీ వైఎస్సార్ సీపీ నాయకులు తోట రామకృష్ణ, దొంగ విజయ్‌కుమార్, కడలి నరసింహ స్వామి, కుక్కల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంజలి పాఠశాలకు విద్యా పరికరాల అందజేత

పాలకొల్లు సెంట్రల్: వైకల్యం అనేది మనిషికే తప్ప మనసుకు కాదని తహసీల్దార్ సిహెచ్ పెద్దిరాజు అన్నారు. శనివారం స్థానిక అంజలి మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలకు భారత ప్రభుత్వం ఎన్ఐఈపీఐడీ (నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటిలెక్చ్యువల్ డిజిబిలిటిస్) సికింద్రాబాద్ వారు దివ్యాంగ విద్యార్థుల కోసం అందించిన ప్రత్యేక విద్యాబోధన పరికరాలను పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ ప్రత్యేక విద్యా బోధన పరికరాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కేవీఆర్ నరసింహారావు, డాక్టర్ ముచ్చర్ల సంజయ్, రిహెబిలిటేషన్ అధికారి ప్రవీణ్ కుమార్, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ డేవిడ్, పాఠశాల సెక్రటరీ విడివి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ సంఘాల మినీ భవనం ప్రారంభం

పెనుగొండ: ములపర్రులో తొమ్మిది ఎస్సీ సంఘాల మినీ భవనాన్ని ఆదివారం ప్రారంభించనున్నట్లు ఎస్సీ సంఘాల కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ప్రారంభిస్తారని తెలిపారు. ముఖ్య అతిథులుగా పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు, సంఘ నాయకులు పాల్గొంటారన్నారు. పరిసర ప్రాంతాలకు చెందిన వారంతా హాజరుకావాలని కోరారు.

వృద్ధులకు ఉచిత కంటి పరీక్షలు

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 60 ఏళ్లు పైబడినవారందరికీ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు ఆపరేషన్ అవసరమైన వారికి ఉచితంగా నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు అన్నారు. పాలకొల్లు మండలం తిల్లపూడిలో శనివారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ ఆరోగ్య శిబిరాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, ఆప్తాల్మిక్ అధికారి ఎం ఆర్‌కే రాజు పాల్గొన్నారు.

ముత్యాలపల్లిలో...

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలోని సచివాలయంలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరంలో పాల్గొన్న డాక్టర్ లీనా సుప్రియ సుమారు 70 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అనంతరం అదే గ్రామంలో దీర్ఘకాలికంగా రోగంతో బాధపడుతూ లేవలేని పరిస్థితిలో ఉన్న వారి ఇంటికి



తిల్లపూడిలో ఆరోగ్య శిబిరాన్ని ఆకస్మిక తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి డా.డి మహేశ్వరరావు

వెళ్లి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో బి.శ్రీనివాస్, బంగారమ్మ, మధుసూధనరావు, సీహెచ్ తులసమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఏసుక్రీస్తు ఉజ్జీవ మహాసభలు

పాలకొల్లు అర్బన్: మండలంలోని శివదేవునిచిక్కాల పంచాయతీ పరిధిలోని జొన్నలగరువులో సోమవారం నుంచి 31 వరకూ ప్రతిరోజు రాత్రి 7 గంటల నుంచి ఏసుక్రీస్తు సువార్త ఉజ్జీవ మహా సభలు నిర్వహిస్తున్నట్లు లంకలకోడేరు ప్యారీస్ పాస్టర్ రెవ. బీవీ రత్నం , జొన్నల గరువు సంఘ పెద్దలు ఒక ప్రకటనలో తెలిపారు. రెవ ఎం.శ్యామ్‌సన్ (విజయవాడ), ఎం.రత్నమణి (తక్కెళ్లపాడు), రెవ సంతోష్‌రెడ్డి (రాజమండ్రి) విచ్చేసి వాక్య పరిచర్య చేస్తారన్నారు. విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అత్యవసర అభివృద్ధి పనులు చేపట్టాలి

పెనుమంట్ర: పెనుమంట్ర మండల పరిషత్‌కు కేటాయించిన 15వ ఆర్థిక సంఘం నిధులతో అత్యవసర అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు తమ గ్రామాల నుంచి ప్రతిపాదనలు రూపొందించి పంపాలని ఎంపీపీ కర్రి వెంకటనారాయణరెడ్డి (వాసు) అన్నారు. శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సభ్యత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలానికి రూ.84 లక్షలు 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయని రూ.92 లక్షలు ఖర్చయ్యే పనులకు ప్రణాళికలు రూపొందించి పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ నిధులలో 50 శాతం రక్షిత మంచినీటి పథకాల అవసరాల నిమిత్తం ఖర్చుచేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఈ సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలపై సంబంధిత శాఖల అధికారులు వివరణ ఇచ్చారు. పెనుమంట్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన గోవిందరాజు హారిక (పెనుమంట్ర) 568 మార్కులు సాధించి ఆచంట నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. ఇదే పాఠశాలలో చదివిన అండలూరు మహిమ (వెలగలవారిపాలెం) 558 మార్కులతో మండల స్థాయిలో ద్వితీయస్థానం, మాముడూరు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థిని వీఎస్ఎస్ఎన్ కామాక్షి (మాముడూరు) 544 మార్కులతో మండల స్థాయిలో తృతీయస్థానంలో నిలిచారు. ఈ ముగ్గురు విద్యార్థినులకు ఎంపీపీ కర్రి వెంకటనారాయణరెడ్డి(వాసు) రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు నగదు పురస్కారాలను అందజేసి సమావేశంలో ఘనంగా సత్కరించారు. పెనుమంట్ర తహసీల్దార్ బీవీఎస్ అశోక్ వర్మఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున మరో రూ.15 వేలు నగదును ప్రోత్సాహక బహుమతిగా అందించారు. నెగ్గిపూడి ఎంపీటీసీ సభ్యురాలు పెనుగొండ లక్ష్మి, ఓడూరు సర్పంచ్ బుర్రా రవికుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీసుభాషిణి, ఎంపీడీఓ వి.పూర్ణబాబ్జి, ఎంపీటీసీ సభ్యులు గండి రామారావు, చింతపల్లి మంగాదేవి, కర్రి అనూరాధ, గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, పెనుగొండ లక్ష్మి , గ్రామ సర్పంచ్‌లు కాకార రాజేశ్వర్రావు, ముదునూరి నాగరాజు, బుర్రా రవికుమార్, తమనంపూడి వీర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వేతో భూముల పరిరక్షణ



డ్రోన్ సర్వే తీరును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

నరసాపురం రూరల్: అందుబాటులోకి వచ్చిన ఆధునిక సర్వే టెక్నాలజీని అందిపుచ్చుకుని ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రెవెన్యూ పరిధిలోని సమస్త భూ రికార్డులను పక్కాగా రీ సర్వే చేసే పనులు చురుగ్గా సాగుతున్నాయని సబ్ కలెక్టర్ సూర్యతేజ అన్నారు. నరసాపురం మండం కొత్తనవరసపురం, సరిపల్లి గ్రామ శివారు చినమామిడిపల్లిలో శనివారం డ్రోన్‌తో చేస్తున్న సర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ఎస్ఎం ఫాజిల్, తదితరులు ఉన్నారు.

తాటాకిల్లు దగ్ధం

పెనుగొండ: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పెనుగొండ చిన్నంవారి పాలెంలో తాటికిల్లు అగ్నికి పూర్తిగా దగ్ధమైంది. శనివారం ఉదయం చిన్నంవారిపాలేనికి చెందిన నొండు మంగన్న దంపతులు పొలం పనికి వెళ్లగా ఉదయం 10.30 గంటల సమయంలో తాటికిల్లు పూర్తి దగ్ధమవ్వడంతో కట్టుబట్టలతో మిగిలారు. ఇంట్లోని వస్తువులు అన్నీ పూర్తిగా బూడిదయ్యాయి. ఆస్తి విలువ సుమారు రూ.1 లక్ష ఉంటుందని అధికారులు అంచనా వేశారు.